సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



ఉత్సాహంగా క్రీడాపోటీలు

బాన్సువాడలో జోనల్ స్థాయి సాంఘిక సంక్షేమ గురుకులాల క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- 10లో ▸



ఒక్కేసి పువ్వేసి..

జిల్లాలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాలలో పాల్గొంటున్నారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.3 /18.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు అథ్లెట్ల ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో 140 మంది క్రీడాకారులు పాల్గొన్నా రని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్ కుమార్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 28 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీలలో సూర్యాపేట ఎస్‌వీ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపికైంది వీరే..

ఎం.మోహన్, బి.సాయితేజ, ఎస్.శ్రీను, బి.మేఘన, బి.రాజాముక్తేశ్వరి, ఎస్.లోకేష్, ఎస్.జగన్, జె.సురేందర్, ఎం.మహేందర్, జె.అర్జున్, బి.హరిత, వై.ఎల్లాలింగ్, బి.సుధాకర్, బి.సునీల్, బి.ఈశ్వర్‌ప్రసాద్, ఆర్.సేవాగ్, ఎం.ఈశ్వర్, జి.పరశురాం, కె.సంతోష్, బి.అర్చన, ఆర్.రవీందర్, కె.అనిల్, కె.నందిని, ఎల్.అఖిల, ఎల్.పవన్, ఆర్.నరేష్, కె.సచిన్, ఎ.అజయ్.


మంత్రికి పరామర్శ

వేల్పూర్: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఆయన తల్లి మంజులమ్మ మూడు రోజుల క్రితం మరణించిన విషయం తెలిసిందే. శనివారం ఆదిలాబాద్, జగిత్యాల, ముథోల్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, సంజయ్, విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టూరిజం ఎండీ మనోహర్, వరంగల్ ఎలక్ట్రిసిటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

ప్రత్యర్థులెవరో?

- నేడు బీ ఫామ్ అందించనున్న అధికార పార్టీ
- కాంగ్రెస్ తొలి జాబితా వెలువడే అవకాశం..
- షబ్బీర్ అలీకి ఓకే.. మిగతా చోట్ల వీడని చిక్కుముడి
- బీజేపీలో టికెట్లపై కొనసాగుతున్న కసరత్తు
- అభ్యర్థులు తేలాక ఊపందుకోనున్న ప్రచారం

ఎన్నికల షెడ్యూల్ విడుదలై వారం కావస్తున్నా.. బీఆర్‌ఎస్ మినహా ఇతర పార్టీలు ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించలేదు. ప్రత్యర్థులెవరో తేలకపోవడంతో ప్రచారమూ జోరందుకోవడం లేదు. కామారెడ్డిలో మినహా మిగతా నియోజకవర్గాల్లో రాజకీయ స్తబ్దత కొనసాగుతోంది.



సాక్షి, కామారెడ్డి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేరోజు వరకు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఊరూరూ తిరుగుతూ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో హంగామా చేశారు. కోడ్ అమలులోకి వచ్చాక పర్యటనలు ఆపేశారు. ఎన్నికలకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవడంపై దృష్టి సారించారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ బరిలో దిగనున్న నేపథ్యంలో ఆ పార్టీ ముఖ్యనేతలంతా నియోజకవర్గంపై దృష్టి సారిస్తున్నారు. మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డిలను పార్టీ ఇన్‌చార్జీలుగా ప్రకటించింది. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే వీజీగౌడ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఇంకా బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను ప్రకటించాల్సి ఉంది. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, షేరి సుభాష్‌రెడ్డిలు ఇప్పటికే కామారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ముఖ్యనేతలతో పలుమార్లు సమావేశమై బూత్ కమిటీల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. వందమంది ఓటర్లకు ఒకరిని ఇన్‌చార్జిగా ఒక్కో బూత్‌లో పది మందితో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జాబితాలు సైతం రూపొందించారు. నియోజకవర్గంలోని ముఖ్యనేతలతో ప్రగతి భవనలో సమావేశం జరగాల్సి ఉండగా.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి తల్లి మరణంతో వాయిదా పడింది. రెండుమూడు రోజుల్లో తిరిగి సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అభ్యర్థులను ప్రకటించి ముందున్న బీఆర్‌ఎస్.. ఆదివారం బీ ఫామ్‌లు కూడా అందజేయనుంది. మరుసటి రోజు నుంచి అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారం మొదలుపెట్టే అవకాశాలున్నాయి. సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గంలో వచ్చేనెల 9న నామినేషన్ వేసి, అదే రోజు జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కాగా ఈనెల 30న బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో సీఎం ఎన్నికల ప్రచార సభలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో రెండో విడతలో సీఎం సభలు ఉండే అవకాశాలున్నాయి.

బీజేపీలో స్తబ్ధత..

భారతీయ జనతా పార్టీలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో ఆ పార్టీలో స్తబ్ధత కొనసాగుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో తప్ప మిగతా చోట్ల నిర్లిప్తత నెలకొంది. ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కామారెడ్డి నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డికే టికెట్టు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికల బరిలో నిలవడానికి ఆయన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నిత్యం జనంలో ఉంటున్న ఆయన ఒకటి రెండు రోజుల్లో ప్రచారం ప్రారంభించనున్నారు. జుక్కల్ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతారకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. బాన్సువాడ, ఎల్లారెడ్డిల నుంచి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాలు ప్రకటించే అవకాశాలుండడంతో.. అభ్యర్థుల ప్రకటన తర్వాత రాజకీయాలు వేడెక్కుతాయని భావిస్తున్నారు.

కాంగ్రెస్.. తేల్చేది ఎప్పుడో?

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికీ ఒక్కచోట కూడా అభ్యర్థిని ప్రకటించలేదు. కాంగ్రెస్ పార్టీ ఆదివారం తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉంది. కామారెడ్డి నుంచి మాజీ మంత్రి షబ్బీర్‌అలీ తప్ప మరెవరూ టికెట్టు కోసం పోటీలో లేకపోవడంతో తొలి జాబితాలోనే షబ్బీర్ అలీ పేరును ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావుల మధ్య టికెట్టు రగడ నడుస్తోంది. ఢిల్లీ వేదికగా ఇద్దరూ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పార్టీ అధిష్ఠానం ఇక్కడ ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తుందన్న విషయమై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. బాన్సువాడ నియోజకవర్గంలో పలుమార్లు పోటీ చేసి ఓడిపోయిన నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆయన వ్యతిరేక వర్గం ఆయనకు తప్ప మరెవరికైనా ఇవ్వాలని పట్టుబడుతోంది. దీంతో ఇక్కడా పీఠముడి వీడడం లేదు. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే గంగారాంతో పాటు మరి కొందరు టికెట్టు ఆశిస్తున్నారు. అయితే ఎవరిని అభ్యర్థిగా నిలుపుతారన్న విషయమై స్పష్టత రావడంలేదు. తొలి జాబితాలో కామారెడ్డి అభ్యర్థి పేరుంటుందని భావిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అభ్యర్థుల ప్రకటనలో కొంత జాప్యం అవుతుందని అంచనా వేస్తున్నారు.

త్వరలో కామారెడ్డికి రాహుల్ గాంధీ రాక!

- 18 లేదా 19 తేదీలలో పర్యటించే అవకాశం
- నేడు జిల్లాకు రానున్న ఎస్పీజీ అధికారులు



సాక్షి, కామారెడ్డి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ త్వరలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించే అవకాశాలున్నాయి. ఆయన 18 లేదా 19 తేదీలలో పర్యటిస్తారని తెలుస్తోంది. 18న జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి రాహుల్‌తో పాటు ప్రియాంక రానున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు, అక్కడినుంచి కామారెడ్డికి వస్తారని సమాచారం. కామారెడ్డిలో రోడ్ షో నిర్వహించేందుకు పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాహుల్ గాంధీ భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు ఆదివారం సాయంత్రం జిల్లాలో పర్యటించనున్నట్టు సమాచారం. ఈ విషయమై మాజీ మంత్రి షబ్బీర్ అలీని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఎస్పీజీ అధికారులు వచ్చిన తర్వాత రాహుల్ గాంధీ పర్యటనపై స్పష్టత వస్తుందని తెలిపారు.

ఏఐసీసీ బృందం పరిశీలన..

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో ఏఐసీసీ బృందం రెండు రోజుల క్రితం ఉమ్మడి జిల్లాలో పర్యటించింది. రాహుల్‌గాంధీ బస చేసే ఓ ప్రైవేట్ హోటల్‌తో పాటు నిజామాబాద్, కామారెడ్డిలలో రాహుల్‌గాంధీ పాదయాత్ర చేసే ప్రాంతాలను పరిశీలించారు. అయితే 19న రాహుల్‌గాంధీకి ఢిల్లీలో జాతీయ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉండడంతో పర్యటనపై సందిగ్ధత నెలకొంది. ఏదేమైనా దసరాలోపు రాహుల్ గాంధీ పర్యటన ఉంటుందని పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పోచారం కుటుంబానికి ఇసుక ముడుపులు

- రోజుకు రూ.10లక్షలు అందుతాయి
- ఆరోపణలపై వెంకటేశ్వరస్వామి పాదాల వద్ద ప్రమాణానికి సిద్ధం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు
- యెండల లక్ష్మీనారాయణ సవాల్



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

సుభాష్‌నగర్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి రోజు రూ. 10 లక్షలు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి పాదాల వద్ద ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, కాదు అంటే పోచారం కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైస్‌మిల్లుల్లో మూడు సీజన్లకు సంబంధించిన సుమారు కోటి మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం విక్రయించేందుకు మొదటి విడతలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి టెండర్లను ఆహ్వానించిందన్నారు. టెండర్లలో రైస్‌మిల్లర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. గన్నీబ్యాగులు, రవాణా, కేంద్రాల కమీషన్ తదితర ఖర్చులతో ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2,313 వెచ్చించి కొనుగోలు చేసిందని, దీనికితోడు రూ. 340 కస్టోడియన్ ఫీజు కూడా చెల్లించిందన్నారు. మొత్తం రూ.2,653 ప్రభుత్వానికి ఖర్చయ్యిందని, కానీ టెండర్లలో రూ. 1,732 (అత్యధిక ధర) బిడ్డింగ్ వేసినట్లు లెక్కలు చూపుతున్నారన్నారు. దీనిపై విమర్శలు రావడంతో రీ టెండర్లను ఆహ్వానించారని, ఈనెల 25న బిడ్డింగ్ ఓపెన్ చేస్తారన్నారు. అందులోనూ రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రూ. 1,800లకు మించి కోట్ చేయవద్దని భావిస్తున్నారన్నారు. అంతేగాకుండా రైస్‌మిల్లుల్లో 50శాతం కూడా లేని ధాన్యానికి టెండర్లు వేస్తున్నారని, అధికారులు, రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం ఉన్నట్లు నివేదికలు ఇచ్చారని విమర్శించారు.

బోధన్ ఎమ్మెల్యే షకీల్, స్పీకర్ పోచారం కుటుంబ సభ్యులు బినామీల పేరుతో రైస్‌మిల్లులు ఏర్పాటు చేసి మిల్లర్లుగా అవతారం ఎత్తారని, టెండర్లలోనూ వారి హస్తముందనే ఆరోపణలు ఉన్నాయని యెండల పేర్కొన్నారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, పార్టీ నాయకులు రాగి నారాయణ యాదవ్, భరత్ భూషణ్, యెండల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

- నేరాల నియంత్రణకు కృషి చేస్తా
- ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు
- 'సాక్షి'తో ఎస్పీ సింధు శర్మ



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ సింధు శర్మ

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో శాంతిభద్రతలపై ప్రధానంగా దృష్టి సారించి నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటానని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆమె ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది శనివారం ఎస్పీని కలిశారు. జిల్లాలో నేరాలు, కేసులు, శాంతి భద్రతల పరిస్థితుల గురించి ఆయా విభాగాలకు చెందిన అధికారులతో ఎస్పీ సమీక్షించారు. అనంతరం 'సాక్షి'తో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖకు ప్రధాన అంశమన్నారు. నేరాల నియంత్రణకు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. నేరాలకు కారణాలను తెలుసుకుని, వాటిని నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిశోధన పూర్తి చేస్తామన్నారు.

ఈసీ గైడ్‌లైన్స్ ప్రకారం..

ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం నడుచుకుంటామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం పోలీసు శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిందని, దాన్ని పరిశీలించి తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే పోలీసులు గుర్తించారని, అందుకు అనుగుణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి..

జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులపై దృష్టి పెడతానని ఎస్పీ తెలిపారు. పట్టణంలో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులతో సమీక్షిస్తానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

కామారెడ్డి టౌన్: ఎస్పీ సింధు శర్మ శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కను అందించారు.

ఘనంగా పాలియేటివ్ కేర్ డే



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో శనివారం ప్రపంచ పాలియేటివ్ కేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శ్రీనివాస్, పాలియేటివ్ కేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఘనశ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

- డాక్యుమెంటరీలు రూపొందించండి
- కళాకారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేందుకు కళాకారులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కళాకారులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం బాగున్నా పట్టణాలలోని యువతలో కొంత నిర్లిప్తత ఉందని, దీంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతోందని పేర్కొన్నారు. కళాకారులు తమ మేధస్సుకు పదునుపెట్టి ఓటు విలువపై అవగాహన కల్పించేలా ఒకటి రెండు నిమిషాల నిడివి గల డాక్యుమెంటరీలను రూపొందించాలని సూచించారు. ఆ డాక్యుమెంటరీలు యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్, డీపీఆర్వో శాంతికుమార్ పాల్గొన్నారు.



కళాకారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

నేటినుంచి శరన్నవరాత్రులు

- ముస్తాబైన మండపాలు
- పట్టణంలో భారీ సెట్టింగ్‌ల ఏర్పాటు

కామారెడ్డి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించడం కోసం ఉత్సవాల నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేశారు. పలుచోట్ల భారీ సెట్టింగ్‌లు వేశారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం జిల్లాలో 2 వేలకుపైగా మండపాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోనే సుమారు 150 మండపాలలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు.

రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం..

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీబాలా త్రిపుర సుందరి దేవి, శ్రీ గాయత్రి దేవి, మహాలక్ష్మిదేవి, అన్నపూర్ణాదేవి, లలితా త్రిపుర సుందరి దేవి, మహాసరస్వతి దేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్ధిని, రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరిస్తారు. తొమ్మిది రోజులపాటు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. మండపాల వద్ద నిత్యం భజనలు చేస్తారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు నిత్యం కోలాటం ఆడతారు. నవరాత్రుల సందర్భంగా మండపాల నిర్వాహకులతోపాటు భక్తులు భవాని మాలధారణ చేస్తారు. నవరాత్రుల అనంతరం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేస్తారు.



కామారెడ్డిలో ప్రతిష్ఠించడం కోసం తీసుకువచ్చిన అమ్మవారి విగ్రహం



జిల్లా కేంద్రంలోని ఓ మండపం వద్ద సెట్టింగ్

ఇంకెంతమందిని బలి తీసుకుంటారు

- ప్రభుత్వంపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆగ్రహం
- ప్రవళిక ఆత్మశాంతికి కామారెడ్డిలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న షబ్బీర్ అలీ, నాయకులు

కామారెడ్డి టౌన్: నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇంకెంత మంది నిరుద్యోగుల ప్రాణాలు బలి తీసుకుంటారో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న గ్రూప్–2 అభ్యర్థి ప్రవళిక ఆత్మశాంతి కోసం శనివారం జిల్లాకేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రవళికకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ప్రవళికది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని పేర్కొన్నారు. నిరుద్యోగులెవరూ తొందరపడి ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు. ఉద్యోగాల కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, పార్టీ నాయకులు చందు, విఠల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలుపై అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి టౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. శనివారం ఆయన ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌లో సివిజిల్ యాప్, ఈ–సువిధ, వ్యయ నియంత్రణ, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పనితీరును పరిశీలించారు. అనంతరం నోడల్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల ఉల్లంఘనపై 1950 టోల్ ఫ్రీ నంబరుకు, ఎన్నికల కంట్రోల్ రూమ్ నంబర్ 84682 23060 కు, సీవిజిల్‌కు వచ్చే ఫిర్యాదులను వంద నిమిషాలలో పరిష్కరించాలన్నారు. ఓటుకోసం ఎవరైనా ప్రలోభపెట్టినా, డబ్బు, మద్యం సరఫరా చేస్తున్నా, భయభ్రాంతులకు గురిచేసినా, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రవాణా చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా, తప్పుడు వార్తలు, పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురించినా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు. ఆయా ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటో లేదా వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని, ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆయా కమిటీల సభ్యులు అన్ని అంశాలపై నిఘా ఉంచాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు కిషన్, సురేందర్ కుమార్, శాంతికుమార్, సతీష్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటస్థావరంపై దాడి

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. దాడిలో రూ.5,350 నగదు, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారమివ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

మాణిక్‌బండార్‌లో..

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ శివారులో ఉన్న ఓ గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. దాడిలో రూ.6,50,400 నగదు, పది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డి : పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై గణేష్ శనివారం తెలిపారు. కామారెడ్డికి చెందిన రమేష్ రెండు నెలల క్రితం ఎల్లారెడ్డిలో ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆయన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయడంతో ఫోన్‌ను కామారెడ్డిలో ఉన్నట్లు గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

ఆహార శాస్త్రంతో ఉపాధి



రుద్రూర్ ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల

- రాష్ట్రంలో ఏకైక ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాల
- 16 వరకు ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అవకాశం

రుద్రూర్: ఆహార రంగంలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ (ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన)కళాశాలను 2015లో రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో ఏర్పాటు చేసింది. దీని ద్వారా విద్యార్థులకు ఉపాధితో పాటు ఉద్యోగావకాశాలు మెరుగవ్వనున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ కళాశాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ న్యూఢిల్లీ వారి ఏ గ్రేడ్ గుర్తింపు ఉంది. ఇక్కడ నాలుగేళ్ల బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సు అందుబాటులో ఉంది. విద్యార్థులు మొదటి మూడేళ్లు ఫుడ్ కెమిస్ట్రీ, ఫుడ్ మైక్రోబయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో విద్యనభ్యసిస్తారు.

నాలుగో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 'ఎక్స్‌పెరియన్షియల్ లెర్నింగ్ పోగ్రామ్ (ఈఎల్‌పీ)లో పాల్గొని స్వయంగా ఆహార ఉత్పత్తిని చేసి మార్కెటింగ్ చేస్తారు. తద్వారా పరిశ్రమను స్థాపించే స్థాయికి ఎదుగుతారు. రెండో సెమిస్టర్‌లో ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో క్షేత్ర స్థాయి శిక్షణను తీసుకొని ప్రాజెక్ట్ వర్క్ కోర్స్ ద్వారా వినూత్నమైన ఆహార ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సాంకేతికతను అందిపుచ్చుకుంటారు. అంతేకాకుండా ఈ కోర్సు పాఠ్యాంశాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, మెరుగైన భవిష్యత్ కోసం కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు సిద్ధం చేస్తాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్

వివిధ రకాల యంత్రాలతో అత్యున్నతమైన సాంకేతిక విద్యను అందిస్తుంది. కోర్సు ముగిసే సమయానికి విద్యార్థులకు వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలపై అనుభవం ఉంటుంది. రైతులు, పరిశ్రమల సిబ్బంది నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి సహాయపడే ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ విభాగంలక్ష్యం.

కోర్సులో ఆరు డిపార్ట్‌మెంట్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ కళాశాలలోని ప్రధాన విభాగం. ఆహార పదార్థాల ప్రాసెసింగ్, సంరక్షణలో విద్యార్థులకు లెర్నింగ్ అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విభాగం ఫుడ్ ప్రాసెసింగ్ ఆవశ్యకతను, ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించే పద్ధతులను వివరిస్తుంది. వినియోగదారులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు హ్యాండ్లింగ్, నాణ్యత నియంత్రణ విభిన్న అంశాలను అర్థం చేసుకోవడం ఈ కోర్సు లక్ష్యం.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్

ఈ విభాగం విద్యార్థులకు ఫుడ్ ప్లాంట్, ఎక్విప్‌మెంట్ డిజైన్, ప్రాసెస్ కంట్రోల్, ప్యాకేజింగ్, ఆహార పదార్థాల నిలువకు సంబంధించిన టెక్నాలజీల ఇన్‌స్ట్రుమెంటేషన్ విద్యను అందిస్తుంది. ఇది ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలకు, ఇంజినీరింగ్ సూత్రాలను వర్తింపజేయడానికి శిక్షణ ఇస్తుంది. ఆహార ఉత్పత్తిలో నాణ్యతను మెరుగుపర్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

ఆహార వ్యాపార నిర్వహణ..

ఆహార చట్టాలు, మార్కెటింగ్ వ్యవహారాలపై శిక్షణ ఉంటుంది. ఇది అధిక నాణ్యతతో నడిచే పరిశ్రమల్లో విద్యార్థులను మరింత ప్రభావితం చేసి వారిని ప్రతిభావంతమైన ప్రొఫెషనల్స్‌గా తయారు చేస్తుంది. సంస్థను స్థాపించడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తుంది.

స్టూడెంట్ రెడీ

స్టూడెంట్ రెడీ (గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన) ప్రోగ్రాం అనేది వ్యవసాయం, అనుబంధ సబ్జెక్టుల గ్రాడ్యుయేట్లకు ఉపాధిని నిర్ధారించడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ చొరవ చూపుతుంది. కార్యక్రమంతో విద్యార్థులు ఎక్స్‌పెరియన్షియల్ లెర్నింగ్ పోగ్రామ్ ఇన్-ప్లాంట్ శిక్షణ పొందుతారు. ఈ విద్యార్థులు తమ సొంత సంస్థను ప్రారంభించడానికి సహాయపడుతుంది.

ఆహార భద్రత, నాణ్యత విభాగం

ఆహార రసాయన శాస్త్రం, మైక్రోబయాలజీకి ఆహార పరిశ్రమలో ప్రధాన ప్రాముఖ్యత ఉంది. ఇందులో రసాయన ప్రతిచర్యలు, సూక్ష్మజీవులు, జీవసంబంధమైన, జీవేతర ఆహార భాగాల్లో వాటి పరస్పర చర్య ప్రక్రియల అధ్యయనం ఉంటుంది. ప్రాసెసింగ్, నిల్వ సమయంలో ఆహారంలో మార్పులతో వ్యవహరిస్తారు. ఆహార పరిశ్రమలో ఇది చాలా ముఖ్యమైనది. ఆహార ప్రాసెసింగ్ రంగం మొత్తం అభివృద్ధికి గ్లోబల్ మార్కెట్‌లో నాణ్యత, ఆహార భద్రతకు పోటీగా మారాయి. ఈ విభాగం విద్యార్థులకు నాణ్యత నియంత్రణ, నాణ్యత హామీ, భద్రత, నిర్వహణకు సంబంధించిన నైపుణ్యాలను బలోపేతం చేసేందుకు సహకరిస్తాయి.

ఉపాధి, ఉద్యోగావకాశాలు

ఈ కోర్సు చదివిన విద్యార్థులకు అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు ఉంటాయి. అత్యధిక ప్రాధాన్యత కలిగిన ఆహార రంగంలో పరిశ్రమలు స్థాపించడానికి ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంలో పరిశ్రమలు స్థాపించడానికి ఎన్నో ప్రోత్సాహక పథకాలు ప్రకటిస్తున్నాయి. ఈ కళాశాలలో పట్టభద్రులైన 158 మందిలో, 18% మంది ఉన్నత విద్య ఇతర దేశాలకు వెళ్లారు. 58% కంటే ఎక్కువ మంది జాతీయ, బహుళజాతి ప్రైవేట్ సంస్థల్లో ఏడాదికి రూ.8 లక్షల కంటే ఎక్కువ ప్యాకేజీని పొందుతున్నారు.

16న స్పాట్ అడ్మిషన్

టీఎస్ ఎంసెట్ ర్యాంకుతో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా, మెరిట్ ఆధారంగా రైతు కోటాలో 40శాతం లోపు ప్రవేశం కల్పిస్తారు. 2023–24 సంవత్సరానికి నేరుగా ఇంటర్‌లో ఎంపీసీ చదివిన వారికి కూడా ఈ కోర్సులో చేరే అవకాశం కల్పించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ కల్పన వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో ఈనెల 16న స్పాట్ అడ్మిషన్ జరగనుంది.

ఆటోలో బాలిక కిడ్నాప్



అక్షర

ఖలీల్‌వాడి: బజ్జీలు కొనిస్తానని బాలికను ఓ ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన అక్షరను ఆటో డ్రైవర్ బజ్జీలు కొనిస్తానని ఆటోలో నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి)కి వచ్చిన తర్వాత బాలిక అక్షర ఏడ్వడంతో స్థానికులు ఆటో ఆపి ఆరా తీశారు. అక్షరను స్థానికులు వివరాలు అడుగగా తల్లి పేరు కవిత, తండ్రి దిగంబర్, సర్పంచ్ రాములు అని చెప్పింది. బజ్జీలు కొనిచ్చి విడిచిపెడతానని చెబితే వచ్చానని, ఇతను ఎవరు మీ తాతాన అని స్థానికులు ప్రశ్నించగా కాదు ఆటో డ్రైవర్ అని అక్షర సమాధానం ఇచ్చింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్షర తల్లిదండ్రులకు సమాచారం అందించామని బాలికను కుటుంబసభ్యులకు అప్పగిస్తామని స్థానికులు చెప్పారు.

బేస్‌బాల్ రీజినల్ టోర్నీలో జిల్లా జట్టు విజయం



విజేతగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: బేస్‌బాల్ హైదరాబాద్ రీజినల్ క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచారు. శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో హైదరాబాద్ రీజినల్ లెవెల్(తెలంగాణ-ఆంధ్రప్రదేశ్), ఎంఎల్‌బీ (బేస్ బాల్)కప్ పోటీలు జరిగాయి. ఇందులో తెలంగాణ స్ట్రైకర్స్ జట్టులో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రథమ స్థానం సాధించారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాయిలో నిర్వహించే 42వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ శనివారం తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులు పండరి, సాయినాథ్, అక్షయ్, సన్నిధి, రుచితను ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, రమణ, ఎన్వీ హనుమంత్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, కిషన్, నర్సయ్య, రాజేశ్వర్, కృష్ణమూర్తి, సురేందర్, నాగేశ్, వినోద్, సాయిబాబా, మాధురి, భాగ్యశ్రీ, స్వప్న, పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు..



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

డిచ్‌పల్లి: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన హైదరాబాద్ రీజనల్ లెవల్ (తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్) ఎంఎల్బీ బేస్ బాల్ కప్ పోటీల్లో తెలంగాణ స్ట్రైకర్స్ జట్టు విజయం సాధించింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి ఉన్నత పాఠశాల క్రీడాకారులు కె.కిశోర్, ఈ.శ్రీశాంత్ తెలంగాణ స్ట్రైకర్స్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఎంఎల్ బీ కప్ ఇండియా ఇన్‌చార్జి డేవిడ్ (అమెరికా) చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ స్థాయి ఎంఎల్ బీ పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం క్రీడాకారులను హెచ్‌ఎం సుశీల్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోటెత్తిన భక్తజనం



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పితృ అమావాస్యను పురస్కరించుకొని అష్టముఖి కోనేరులో భక్తులు స్నానమాచరించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధ గాంచిన ఈ అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించడానికి మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి



కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు



కోనేరు వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

క్రైం కార్నర్

గుండెపోటుతో బాలిక మృతి



మైథిలీ (ఫైల్)

మోపాల్: కంజర్ గ్రామానికిచెందిన మైథిలీ (12) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైథిలీ కంజర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన మైథిలీ రాత్రి ఇంట్లో భోజనం చేశాక ఛాతిలో నొప్పి వస్తుందని తల్లి సాయిలక్ష్మికి తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాము కాటుతో యువకుడు..

రుద్రూర్: సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్(31) పాము కాటుతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో గేదెలను మేత కోసం తీసుకెళ్లగా అక్కడ పాము కాటు వేసిందని ఫయాజ్ గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో రాథోడ్ మోహన్‌కు చెందిన ఆవు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆవులను మేత కోసం గ్రామ శివారుకు తీసుకెళ్తుండగా ప్రాథమిక పాఠశాల వెనుక ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నష్టపరిహారం కోసం పైఅధికారులకు నివేదిక పంపుతామని అధికారులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని దుబ్బలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దుబ్బ ప్రాంతానికి చెందిన అశోక్ తన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి సిద్దిపేట్‌కు వెళ్లారు. దుండగులు రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించిన స్థానికులు అశోక్‌కు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నగదు పట్టివేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. రెండు లక్షలు, 14.80 తులాల బంగారం, మరొకరి నుంచి రూ. 7లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు. పట్టుకున్న నగదు, బంగారాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

చదువు ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: చదువు ఇష్టం లేక రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి సమీపంలోని రంగంపేట రైల్వే గేటు వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం గోకుల్ తండాకు చెందిన బాదావత్ అనిల్ (19) రామారెడ్డిలో ఇంటర్ వరకు చదివాడు. ఇటీవల బీఫార్మసీ చదవడానికి అతని తల్లిదండ్రులు ఖమ్మంలోని కళాశాలలో చేర్పించారు. ఈనెల 6న ఖమ్మం వెళ్లిన అతడు ఇంటికి తిరిగి వస్తానని చెప్పి13న రైలులో బయలుదేరాడు. కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో శనివారం దిగిన అతడు ఆటోలో రంగంపేట వరకు చేరుకొని గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని రైల్వే ఎస్సై తావునాయక్ పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

గాంధారి(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో మండల కేంద్రానికి చెందిన పిరాయి కృష్ణ (38) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ శనివారం తెలిపారు. ఇంట్లో జరిగిన గొడవలు, కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి తండ్రి బల్వంత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఇందల్వాయి: మండలంలోని పాత నేరస్తులను ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే వరకు అన్ని రకాల భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతి భద్రతల అదుపులో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని ఎస్సై కోరారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీవో అలివేలు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో గల తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో జోనల్ స్థాయి క్రీడలు రసవత్తరంగా సాగుతున్నాయి. పోటీలను శనివారం ఉమ్మడి జిల్లాల ఆర్‌సీవో అలివేలు సందర్శించారు. 3వ జోన్‌లోని కామారెడ్డి, సిద్దిపేట్ జిల్లాలకు చెందిన సుమారు 1275మంది క్రీడాకారులు స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొంటున్నారని, పోటీలు ఈనెల 16న ముగుస్తాయన్నారు. డీసీవో కృతామూర్తి ఆధ్వర్యంలో క్రీడాకారులు, హాజరైన పీఈటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మకుమారి తెలిపారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బెల్ట్‌షాపుపై దాడి



నిజాంసాగర్: మల్లూర్ గ్రామంలోని బెల్ట్‌షాపుపై ఎస్సై రాజశేఖర్ శనివారం రాత్రి దాడి చేశారు. గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న సురేశ్‌ను అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మెట్‌పల్లిలో..

మాక్లూర్: మండలంలోని మెట్‌పల్లిలో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి రూ. నాలుగు వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో ఏఆర్ కానిస్టేబుల్ అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: వివాహితపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఏఆర్ కానిస్టేబుల్ కనికరం నటరాజ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన నటరాజ్ కొన్ని సంవత్సరాలుగా వివాహం చేసుకుంటానని నమ్మిస్తూ సన్నిహితంగా ఉంటున్నాడు. కాగా నటరాజ్ మరో యువతితో వివాహం చేసుకోడానికి సిద్ధమవుతున్నట్లు వివాహిత తెలుసుకుని సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. దీంతో సీపీ ఆర్మూర్ పోలీసులను విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ చేపట్టిన పోలీసులు నటరాజ్‌పై అత్యాచార కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.